ప్రజాశక్తి
ఆదివారం 22 జనవరి 2023
5
కర్నూలు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రభాకర్‌రెడ్డి

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు. శనివారం నగరంలోని బిక్యాంపులో ఉన్న ఓ ప్రయివేట్ కల్యాణ మండపంలో పదో తరగతి పరీక్ష ఫలితాలపై విద్యాశాఖ ఆధ్వర్యంలో వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరయిన కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలలోని ఉపాధ్యాయులను మొదలుకొని డిఇఒ వరకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే వంద శాతం ఉత్తీర్ణత సాధించగలమని తెలిపారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం 31,766 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. అందులో ప్రభుత్వ పాఠశాలలల నుంచి 22,791 మంది, ప్రయివేట్ పాఠశాలల నుంచి 8,975 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. గ్రామీణ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులు ఫెయిల్ అయితే వారు మళ్లీ తిరిగి చదవడం చాలా కష్టమని చెప్పారు. హాస్టల్, రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థులను చైతన్య పరిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉంటారో వారికి ఆ సబ్జెక్టుపై

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రత్యేక తరగతులు తీసుకొని ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. డిఇఒ డాక్టర్ వెంకట రంగారెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్, ఆయా సంక్షేమ శాఖల అధికారులు వెంకటలక్ష్మమ్మ, సూర్య ప్రతాపరెడ్డి, మహబూబ్ బాష, శ్రీనివాస రావు, జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. ఓర్వకల్లు మండలంలోని మీదివేముల గ్రామంలోని జగనన్న కాలనీ లేఅవుట్, గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. గ్రామ పరిధిలో మంజూరైన ఇళ్ల నిర్మాణాల గురించి, వాటి నిర్మాణ స్థితి గురించి హౌసింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన వాటికి పూర్తి మౌలిక సదుపాయాలైన నీరు, విద్యుత్ ఏర్పాటు చేయాలన్నారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఓర్వకల్లు ఎంపిడిఒ శివనాగప్రసాద్ పాల్గొన్నారు.

మీదివేములలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ విధానాలతో
వినియోగదారులపై భారాలు

- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వ విధానాలు విద్యుత్ వినియోగదారులపై భారాలు వేసే విధంగా, కార్పొరేట్లకు మేలు చేసేలా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. ఎపిఈఆర్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎపిఈఆర్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్వీ ఉమాపతితోపాటు కె.ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్ పేరుతో వ్యవసాయ విద్యుత్ మోటార్ కనెక్షన్లకు మీటర్లు బిగించే ఆలోచనలను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా పిన్నాపురం దగ్గర ఐఆర్‌ఈపి ప్రాజెక్టు ఏర్పాటులో భాగంగా గ్రీన్‌కో కంపెనీ రైతుల నుంచి తీసుకున్న భూములకు న్యాయమైన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 25 ఏళ్ల అగ్రిమెంట్‌ను ఐదేళ్లకు పరిమితం చేసేలా హిందుజా కంపెనీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ మీటర్ల గురించి అధ్యయనం చేసేందుకు ప్రజా ఎనర్జీ గ్రూపునకు ఇచ్చారని, ఆ గ్రూపు చేసిన అధ్యయనం ఎవరికి ఉపయోగంగా ఉందో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పేరు చెప్పి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మీటర్లు బిగించాలని చూస్తోందని తెలిపారు. మీటర్లు బిగించడం వల్ల అదానికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. గృహ, చిరు వ్యాపారుల కోసమో, కంపెనీల లాభాల కోసమో తెలియజేయాలని కోరారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రూ.వేలల్లో ఉన్న డిపాజిట్ రూ.లక్షలకు పెంచారని తెలిపారు. అలాగే విద్యుత్ స్తంభాలకు కూడా రూ.12 వేలు ఉంటే రూ.15 వేలకు పెంచారని చెప్పారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్రెడాయ్ ప్రతినిధి తారకేష్ మాట్లాడుతూ... లేఅవుట్లకు సంబంధించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇఇలు, డిఇలు పాల్గొన్నారు.

గడ్డికి గిరాకీ..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఈ సంవత్సరం రైతులు వరి పంటను తక్కువగా సాగు చేయడంతో వరిగడ్డికి భలే గిరాకీ ఏర్పడింది. ట్రాక్టర్ వరిగడ్డి రూ.13 వేల నుండి రూ.15 వేల ధర పలుకుతోంది. రైతులు ఎక్కువగా మొక్కజొన్న, పత్తి, కంది పంటలను సాగు చేయడంతో పశుగ్రాస కొరత ఏర్పడింది. దీంతో ఎస్ఆర్‌బిసి కాలువ కింద , కుందు కింద, కెసి కెనాల్, తెలుగు గంగ కాలువల కింద వరి సాగుచేసిన రైతుల నుండి వరిగడ్డిని పశుగ్రాసం కోసం పాడి రైతులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వరిగడ్డికి గిరాకీ ఏర్పడింది. కరా వరిగడ్డి రూ.5 వేలకు కొనుగోలు చేసి ట్రాక్టర్ ద్వారా సొంత గ్రామాలకు తరలించడానికి కూలీలతో ట్రాక్టర్ బాడుగతో రూ.13 వేల నుండి రూ.15 వేలు ఖర్చు అవుతోంది. ప్రాణానికి సమానంగా పెంచుకున్న పశువులను అమ్ముకోలేక వరిగడ్డి ఎక్కువ రేటు పెట్టి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వేసవికాలంలో పశువులకు గ్రాసం కొరత ఏర్పడుతుందని దీంతో అధిక రేటు పెట్టి కొనడం తప్పడం లేదని పశువుల యజమానులు అంటున్నారు. గతంలో వరిని కూలీలతో కోసి కట్టలు కట్టి పంటలు నూర్పు చేయడంతో గడ్డి అధికంగా పడేది వరిగడ్డి పశువుల దానాగా ఉపయోగపడేది. అయితే ఇటీవల యంత్రాలు రావడంతో యంత్రాలతో వరిని కోయడంతో గడ్డి తక్కువగా వస్తోంది. దీనికి తోడు రెండు సంవత్సరాల నుండి వరి పంటను సాగు చేస్తే దిగుబడి రాకపోవడం పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు వరి పంటను సాగు చేయడం లేదు. వరి సాగు గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, కంది, పత్తి పంటలను అధికంగా సాగు చేస్తున్నారు.

'ఫేస్'తో చుక్కలు....

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అందరికీ తెలిసిందే. జనవరి 1 నుండి ఉన్నత స్థాయి అధికారులు అమలు చేయాలని, క్షేత్రస్థాయి ఉద్యోగులకు జనవరి 15 నుండి ఫేషియల్ హాజరు అమలు చేయాలని నిర్ణయించింది. ఫేస్ యాప్ హాజరు కోసం ఉద్యోగులు నానా తంటాలు పడుతున్నారు. ఫేస్ యాప్ డౌన్లోడ్ చేసుకొని అందులో ఉద్యోగులు తమ ముఖాన్ని చూపిస్తూ హాజరు వేసుకోవాలి. అయితే ఆఫీసులలో ఇంటర్నెట్ కనెక్ట్ కాకపోవడం, కనెక్ట్ అయినా సర్వర్ మొరాయించడం వంటి సమస్యల తో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ యాప్ హాజరుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విధులు నిర్వహించుకోలేకపోతున్నామని ఉద్యోగులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ తీవ్ర సమస్యగా మారనుందని ఉద్యోగ సంఘాలు వాదిస్తున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్య తలెత్తుతుందని ఉద్యోగులు అంటున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

సభలు, ర్యాలీలను నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 1 ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేశారు. జ్యోతి బసు 14వ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సిపిఎం నాయకులు నివాళులు అర్పించారు. కర్నూలు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత తెలకపల్లి నరసింహయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా వర్ధంతి సభలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు నివాళులర్పించాయి. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నమూనా పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. యోగి వేమన జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో వివిధ పోటీలు నిర్వహించారు.

జగన్ అరాచక పాలన...

- సలహాదారుల నియామకాలు ఎందుకు
- రైతుల ఉచిత విద్యుత్‌కు మంగళం
- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలన అరాచక పాలనగా ఉందని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు విమర్శించారు. ఈ పాలనకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని కోరారు. రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లను బిగించడం ద్వారా ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడేందుకే జగన్మోహన్ రెడ్డి సిద్ధమయ్యారని తెలిపారు. శనివారం నగరంలోని డిసిసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు ఎం.సుధాకర్ బాబు అధ్యక్షత వహించారు. గిడుగు రుద్రరాజు ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని తెలిపారు. సమర్థవంతమైన అధికారులు ఉన్నప్పటికీ సలహాదారులను నియమించి ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి రోజూ కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా ముఖ్యమంత్రి చీకటి జిఒలను తెస్తున్నారని తెలిపారు. అనంతరం ఎఐసిసి కార్యదర్శి సిడి మయప్పన్ మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత మొదలైందని, వైసిపిని గద్దె దింపే రోజులు దగ్గర పడుతున్నాయని తెలిపారు. కేంద్రంలో మోడీని దింపేందుకు కాంగ్రెస్ పార్టీ సంసిద్ధమైనన్నారు. పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్ వలీ, రాష్ట్ర మైనార్టీ సెల్ ఛైర్మన్ దాదా గాంధీ, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు నాగమధు యాదవ్, కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు బి.నీలకంఠప్ప, కె.లక్ష్మీ నారాయణ రెడ్డి, దామోదరం రాధాకృష్ణ, కె.బాబురావు, బి.క్రాంతినాయుడు, డిఎస్.బాష, డిసిసి ఉపాధ్యక్షులు కె.పెద్దారెడ్డి, దేవిశెట్టి ప్రకాష్, కాశీంవలీ, కోసిగి జిలాని, చిప్పగిరి లక్ష్మీనారాయణ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, కిసాన్ సెల్ అధ్యక్షులు పోతుల శేఖర్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటం

- ఎపి ఎన్‌జిఒ సంఘం నేతలపై విమర్శలు తగదు
- ఎపిజిఇపి గుర్తింపు రద్దు చేయాలి
- ఎపి ఎన్‌జిఒ సంఘం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగుల హక్కుల సాధనకు అన్ని సంఘాలూ కలిసికట్టుగా పోరాటం చేయాలని ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.వెంగళ్ రెడ్డి, జవహర్ లాల్ కోరారు. ఎపి ఎన్‌జిఒ సంఘం నాయకులపై ఎపిజిఇపి సంఘం నాయకులు సూర్యనారాయణ విమర్శలు చేయడం తగదన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల గవర్నర్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు కెఆర్.సూర్యనారాయణ ఉద్యోగ సంఘాల నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేశారని తెలిపారు. గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదు అంశాలను బట్టబయలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సూర్యనారాయణకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అక్రమ మార్గంలో తెచ్చుకున్నారని తెలిపారు. ఆ సంఘానికి ఇచ్చిన గుర్తింపును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన సంఘంలో ఉన్న వారంతా గెజిటెడ్ అధికారులే కానీ నాన్ గెజిటెడ్ ఉద్యోగులు లేరని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాల్సింది పోయి వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైంది కాదన్నారు. ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన జిపిఎఫ్ రుణాలు ఎపిజిఎల్ఐ అరియర్స్ వంటివి సాధించేందుకు ఉద్యమించాలని హితవు పలికారు. ఉద్యోగ సంఘాలపై ఇప్పటికైనా సూర్యనారాయణ విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, నగర అధ్యక్షులు కాశన్న, జిల్లా నాయకులు సాంబశివారెడ్డి, కృష్ణుడు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి, జవహర్ లాల్

పొత్తుపై త్వరలోనే చెబుతాం

- పొత్తులు లేకుంటే అన్ని స్థానాల్లో పోటీ
-కళ్యాణ్ బాబును సిఎం చేద్దాం
- జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు కొణిదెల నాగబాబు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

'వచ్చే ఎన్నికల్లో ఎవరితో పొత్తు అన్నది త్వరలో చెబుతాం. పొత్తులు లేకుంటే రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుంది' అని ఆ పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు కొణిదెల నాగబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వ్యతిరేక ఓటు చీలకుండా పార్టీకి ఒక వ్యూహం ఉందన్నారు. శనివారం స్థానిక మౌర్యాఇన్‌లోని పరిణయ హాలులో జనసేన పార్టీ వీర మహిళలు, జన సైనికుల జిల్లా స్థాయి సామూహిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నాగబాబు హాజరై మాట్లాడారు. జనసేన పార్టీ సామాన్యుల కోసం పుట్టిందన్నారు. వైసీపీ నాలుగు సంవత్సరాల పాలన అంతా రౌడీయిజం, గుండాయిజమని విమర్శించారు. పరిశ్రమలు రాక, అభివృద్ధి లేక యువత నిర్వీర్యం అవుతోందన్నారు. అందుకనే జనసేన పార్టీ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరిగిన యువ శక్తి పేరుతో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేపట్టిన కార్యక్రమంపై వైసీపీ కన్నేసిందన్నారు. ఎవరు వెళ్లారు. ఎవరు వెంట ఉన్నారంటూ వేధిస్తోందన్నారు. రాష్ట్రంలో అరాచక, చెత్త పాలన సాగుతుందన్నారు. కళ్యాణ్ బాబును సిఎం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జనసేన పార్టీ వల్లే అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకత ఉందన్నారు. సమావేశంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు చిలకం మధుసూధన్ రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయవాది కళ్యాణ్ దిలీప్ సుంకర, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, టీసీ వరుణ్, పాణ్యం నియోజకవర్గ ఇంచార్జీ చింతా సురేష్ బాబు, ఎమ్మిగనూరు నియోజకవర్గం ఇంచార్జీ రేఖాగౌడ్, రాయలసీమ వీర మహిళ ప్రాంతీయకమిటీ సభ్యురాలు హసీనా బేగం, నాయకులు హర్షద్, చల్లా వరుణ్, తేన రాజు, మల్లయ్య, వెంకప్ప, లక్ష్మన్న, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగబాబు

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు : ఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

నేడు పోలీసు కానిస్టేబుల్ (సివిల్, ఎపిఎస్పీ) అభ్యర్థులకు జరిగే ప్రిలిమినరీ రాత పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి బందోబస్తు నిమిత్తం విచ్చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మాల్ ప్రాక్టీస్ లేకుండా చూడాలన్నారు. 200 మీటర్ల దూరంలో జిరాక్స్ సెంటర్లు లేకుండా చూసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షిస్తాయన్నారు. నేడు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరి పరీక్ష ఉందన్నారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటల నుండే పరీక్ష హాలులోకి అనుమతిస్తారన్నారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించే సమయంలో తనిఖీలు చేయాలన్నారు. హాల్ టికెట్‌తో పాటు, బాల్ పెన్ను, ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డు ఒకటి (ఆధార్, పాన్, డ్రైవింగ్ లెసెన్సు, పాస్ పోర్టు) ఉండే విధంగా చూడాలన్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ (డిజిటల్) వాచ్‌లు, ఇతర వస్తువులు పరీక్ష హాలుకు అనుమతించకూడదన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా మొత్తం 48 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన 22 వేల 630 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఇందులో పురుష అభ్యర్థులు 18,117, మహిళా అభ్యర్థులు 4,513 మంది ఉన్నారన్నారు. పరీక్ష ముగిసేవరకు సిబ్బంది అందరూ పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్, రీజనల్ కో ఆర్డినేటర్ పుల్లా రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస రెడ్డి, డిఎస్పీలు వెంకట్రామయ్య, నాగభూషణం, శ్రీనివాసులు, కె.వి మహేష్, యుగంధర్ బాబు,దేవ కుమార్, రామరావు, రాజ కుమార్, సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

కానిస్టేబుల్ అభ్యర్థుల కోసం ఎనిమిది బస్సులు : ఆర్ఎం

కర్నూలు కార్పొరేషన్ : కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఏపిఎస్ఆర్టీసీ 8 బస్సులను నడుపుతున్నట్లు ఆర్ఎం టివి రామం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల కోసం కర్నూల్ నగరంలోని తాండ్రపాడు వైపు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, వెంకయ్య పల్లి వైపు పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ, చిన్నటేకూరు వైపు కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ వరకు, సుంకేసుల రోడ్డు వైపు సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల వరకు రెండేసి బస్సులు చొప్పున మొత్తం ఎనిమిది బస్సులను ఉదయం 8 గంటల నుండి పరీక్ష సమయం వరకు సాధారణ చార్జీ 20 రూపాయలతో నడపనున్నట్లు తెలిపారు. ఈ రోడ్లలో రెగ్యులర్‌గా తిరిగే బస్సులతో పాటు అదనంగా తిప్పబడునని, పరీక్షా కేంద్రాల వద్ద బస్సులను పర్యవేక్షించుటకు ప్రత్యేక అధికారులను కూడా నియమించామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పరీక్షలు రాసే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులకు వృత్తిపన్ను ఉపసంహరించుకోవాలి

- జెసికి ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధి బృందం వినతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జర్నలిస్టులకు వత్తి పన్ను ఉపసంహరించుకోవాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధి బృందం శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాంసుందర్ రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోరంట్లప్పలు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులపై ప్రభుత్వ వాణిజ్య పన్నుల విభాగం వృత్తిపన్ను విధిస్తూ నోటీసులు జారీ చేయడాన్ని ఎపిడబ్ల్యుజెఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గతంలో రాజంపేటలో జర్నలిస్టులకు వృత్తి పన్ను నోటీసులు జారీ చేశారని, జర్నలిస్టులు ఆందోళనలు చేయడంతో అప్పుడు ఆ నిర్ణయాన్ని విరమించుకున్నారని చెప్పారు. ప్రభుత్వం, అటు యాజమాన్యాల ఒత్తిళ్ల మధ్య జర్నలిస్టులు నలిగిపోతున్నారన్నారు తెలిపారు. ఈ విషయంపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో మాట్లాడతామని, పూర్తి విషయాలను చర్చించి జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్న రామాంజనేయులు, ఉపాధ్యక్షులు బసప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు శివ కుమార్, నాగేంద్ర, నగర ఉపాధ్యక్షులు విద్యాసాగర్, రమేష్, సహాయ కార్యదర్శి సునీల్ కుమార్, జిల్లా నాయకులు చంద్రమోహన్, శ్రీనాథ్ రెడ్డి, నాగేంద్రుడు, మధు, సునీల్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం అందజేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధి బృందం

'శ్రీ శంకరాస్'లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాలలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి హరికిషన్ అధ్యక్షతన శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్ బి.తిమ్మయ్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలు నెరవేర్చుకోవాలని, క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా మెలగాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అకాడమిక్ అడ్వైజర్ వసంత కుమారి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకి డైరెక్టర్‌గా రెండోసారి గుంతా దేవి

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని జొన్నగిరి గ్రామానికి చెందిన విద్యాకమిటీ ఛైర్మన్ గుంత రాఘవేంద్ర భార్య గుంత దేవి రెండవసారి వాల్మీక ఫెడరేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ నుండి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంతా దేవి మాట్లాడుతూ తనను రెండవసారిగా వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, పత్తికొండ శాసన సభ్యులు శ్రీదేవికి, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అహర్నిశలు కష్టపడే కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికలలో ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు. ఆమె ఎంపిక పట్ల మండల కమిటీ అధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, సచివాలయం మండల కన్వీనర్ ఆర్.హనుమంతు, నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

పథకాలు సక్రమంగా అమలు చేయాలి

- రూ.35 కోట్లతో జింకల పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు
- కమిటీ చైర్మన్ ఎంపీ సంజీవ్ కుమార్
- గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలి : దిశా కమిటీ సభ్యులు

కర్నూలు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలవుతున్న పథకాలు పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని దిశా కమిటీ ఛైర్మన్, ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ ఆదేశించారు. అలాగే జింకల పార్కు ఏర్పాటుకు రూ.35 కోట్లతో ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో దిశా కమిటీ సమావేశం జరిగింది. ఎంపీ సంజీవ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కో ఛైర్మన్ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, డాక్టర్ జె.సుధాకర్, కమిటీ సభ్యులు నరసింహ, రమేష్, వాణి, కృష్ణ రెడ్డి, రమేష్ గుప్తా, పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిశా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోని మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి పనులను అడిగిన కూలీలందరికీ పెడతామన్నారు. కర్నూల్ నుండి గుంటూరు హైవే నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ఎంపీ కోరారు. నంద్యాల ఎంపీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది విధులు సరిగా నిర్వహించడం లేదన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లడుతూ ప్రధాన మంత్రి సడక్ యోజన కింద బళ్ళారి చౌరస్తా నుండి పెద్దపాడు వరకు రోడు పనులు మంజూరు చేయాలని పంచాయతి రాజ్ ఎస్ఇని ఆదేశించారు.

మాట్లాడుతున్న కలెక్టర్

మిరప పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు

మిరప రైతులను ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-కోసిగి రూరల్

మండలంలో నష్టపోయిన మిరప రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో కోసిగిలో మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు మిరప పంట సాగు చేసేందుకు లక్షలాది రూపాయలు అప్పులు చేశారని తెలిపారు. ఖరీఫ్‌లో కురిసిన అధిక వర్షాల వల్ల మిరప పంటకు తెగుళ్లు సోకి, ఎదుగుదల లేక, దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. మిరప పంట ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్లు రావాల్సి ఉండగా కేవలం 2, 3 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని తెలిపారు. రైతులు పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని చెప్పారు. అప్పులు పెరిగి తీర్చే మార్గం కానరాక రైతులు వలసలు పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిరప పంటను పరిశీలించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాలే ఉల్లి, పత్తి రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించి వలసలను నివారించాలని కోరారు. లేకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పూజారి శ్రీనివాసులు, వీరేష్, వ్యకాస నాయకులు ఆదెప్ప, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతులు పెద్ద ముకప్ప, రాము, ఖలందర్ పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఆర్‌టిఒ కార్యాలయం వద్ద 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఉప రవాణా కమిషనర్ శ్రీధర్, డీఎస్పీ వినోద్ కుమార్, ఆర్‌టిఒ శివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మద్యం తాగి వాహనం నడపడం వల్ల ఎదురుగా వచ్చే వాటిని గమనించక అదుపుతప్పి గాయాలపాలై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికీ కొందరు రద్దీ ఉన్న ప్రాంతాల్లో సైతం సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారని చెప్పారు. వాహనాలను శ్రద్ధగా నడిపి గమ్యాన్ని చేరుకోవాలని కోరారు. వారం రోజులపాటు రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తామని వివరించారు. ప్రాణం విలువ తెలుసుకొని జాగ్రత్తలు వహించాలని లారీ ఓనర్లు, డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వాహన ఇన్‌స్పెక్టర్లు శిశిర దీప్తి, సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ప్రజాశక్తి - ఆదోని

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న గిడ్డయ్య

జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎస్.సుదర్శన్ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడారు. మౌలిక సదుపాయాలు లేక ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈనెల 17 నుంచి 30 వరకు సంతకాల సేకరణ, 30న బాధితులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, ఫిబ్రవరి 6న కలెక్టరేట్ల వద్ద ధర్నా, 22న విజయవాడలో పెద్దఎత్తున మహా ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు కొత్తూరు ఈరన్న, గిరి, మల్లప్ప, రంజిత్ గౌడ్, పులి రాజు, హుస్సేని, ఈరన్న, గోపి, పరశురామ్, వెంకటేష్ పాల్గొన్నారు.

వేతనాలు రావడం లేదు...

- వలసలు పెరుగుతున్నాయి..!

ప్రజాశక్తి - కౌతాళం

ఉపాధి హామీ చట్టంలో పని చేసిన కూలీలకు వేతనాలు అందకపోవడంతో మండలంలో వలసలు పెరుగుతున్నాయి. 'వలసలు వెళ్లకండి. ఉపాధి హామీ పనులకు కూలీలు రావాలి' అని ఎనర్జీస్ అధికారులు కోరుతున్నారు. తప్ప కూలీలకు వేతనాలు అందించడంలో చొరవ చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని ప్రతి గ్రామం నుంచి గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. ప్రతి రోజూ 2, 3 లారీల ద్వారా వలసలు వెళ్తూనే ఉన్నారు.

వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు

- ఉల్లిగమ్మ, ఉపాధి కూలీ, గుడికంబాలి గ్రామం

ప్రతిరోజూ ఉపాధి హామీ పనులకు వెళ్లి పనులు చేస్తున్నాం. 5 వారాల నుంచి వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వేతనాలు రాకపోవడంతో నిత్యావసర వస్తువులు కొనాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. వారం, వారం వేతనాలు అందేలా అధికారులు చూడాలి.

అధికారులు చర్యలు తీసుకోవాలి

- ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం మండల అధ్యక్షులు మారెప్ప

ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. వేతనాలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే కూలీలు పనులకు రావడానికి ఆసక్తి చూపరు. వేతనాలు ఆలస్యమైతే ఉపాధి కూలీలు వలసలు వెళ్లడానికి సిద్ధపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వారం, వారం వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

స్వర్ణమయం.. రాఘవేంద్రుని మూల బృందావనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసిన పూజారులు తులసీ అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ పుష్ప హారాలతో అలంకరించారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. అమావాస్య సందర్భంగా రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. తుంగభద్ర నదిలో స్నానాలు చేసి గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీమఠం యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ భోజనశాలలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ఉన్న భక్తులు

అంబేద్కర్ ఆశయాలు మరపురానివి

- జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

మహా మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన సూక్తులు, ఆశయాలు మరపురానివని, ప్రతి ఒక్కరూ ఆచరణలో పాటించాలని జడ్‌పిటిసి విరుపాక్షి పేర్కొన్నారు. శనివారం ఉమ్మడి జిల్లాల జై భీమ్ సభ్యులు ఎంఆర్‌పిఎస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ప్రారంభోత్సవ ఖర్చులకు జడ్‌పిటిసి తనవంతుగా రూ.5 వేలు విరాళంగా అందజేశారు. విరుపాక్షి మాట్లాడుతూ... అంటరానితనం రూపుమాపేందుకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కృషి, పట్టుదలను ప్రతి ఒక్కరూ మెచ్చుకోవాలన్నారు. యువత అందరూ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

కార్యాలయ ప్రారంభోత్సవానికి విరాళం అందజేస్తున్న జడ్‌పిటిసి

స్టేట్ మీట్‌కు క్రీడాకారులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలకు చెందిన క్రీడాకారులు స్టేట్ మీట్‌కు ఎంపికైనట్లు ఆదోని ఫిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.అమర్ ప్రకాష్ తెలిపారు. శనివారం పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 వరకు ప్రాక్టీస్ చేసుకునేందుకు మైదానానికి అనుమతిచ్చి, సహకరించినందుకు కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ట్స్ కళాశాలకు చెందిన బండారి రాజు, బి.అంజలి, హారతి, వరలక్ష్మీ, శ్రుతి, కవిత ఈనెల 25 నుంచి 27 వరకు విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో నిర్వహించే సీనియర్ స్టేట్‌మీట్‌లో పాల్గొంటారని చెప్పారు. అసోసియేషన్ సభ్యులు జయరాం, మారెన్న, దుబ్బన్న, రామాంజి, నాగరాజు, యు.రవి, గోవిందరాజులు, గోవిందు క్రీడాకారులను అభినందించారు.

స్టేట్ మీట్‌కు ఎంపికైన క్రీడాకారులు

అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు కోసిగి విద్యార్థులు

ప్రజాశక్తి- కోసిగి రూరల్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కోసిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణమూర్తి, పీడీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి.నరసింహులు, 9వ తరగతి చదువుతున్న ఎన్.మహేంద్ర అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబర్‌లో కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మహేంద్ర, నరసింహులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 23 నుంచి 25 వరకు విజయనగరం జిల్లా అగ్గోలులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, పీడీ ఖలీల్ అహ్మద్, పిఇటి శ్రీరాములు అభినందించారు.

సుస్థిర వ్యవసాయ పద్ధతులు మేలు

- అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్, ఆర్డీప్ నాగరాజు

ప్రజాశక్తి - హోళగుంద

సుస్థిర వ్యవసాయ పద్ధతులతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్, ఆర్డీప్ నాగరాజు తెలిపారు. శనివారం మండలంలోని హెబ్బటం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ సంస్థల ఆధ్వర్యంలో రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్థానిక రైతు పాటయ్య రెండెకరాల మిరప పంటలో సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించి సాగు చేసినట్లు తెలిపారు. నీలి, పసుపు అట్టలు, వేపనూనె, వేప పిండి, నల్ల తామర పురుగు నివారణ కోసం వారానికోసారి గుంటక తోలుకోవాలని సూచించారు. వేప నూనె, పిచికారి చేసుకోవడం తదితర పద్ధతులను అవలంభిస్తూ తక్కువ పెట్టుబడితో సాగు చేసినట్లు చెప్పారు. పురుగు మందుల వినియోగం తగ్గిస్తూ పంటను సాగు చేసినట్లు తెలిపారు. భీమేష్, రైతు పాటయ్య పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్

రూ.13 కోట్ల పన్నుల వసూలే లక్ష్యం

- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో ఆస్తి పన్ను లక్ష్యాన్ని చేరుకునే దిశగా వసూలుకు ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ఆదేశించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో రెవెన్యూ సెక్షన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని పట్టణంలో ఆస్తి పన్ను రూ.13 కోట్ల వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.6 కోట్లు వసూలు చేశామన్నారు. మార్చి చివరిలోపు మరో రూ.7 కోట్ల వసూలుకు ప్రణాళిక పెట్టుకున్నామని తెలిపారు. నీటి పన్ను పెండింగ్‌లో ఉందని, వసూలుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న నీటి పన్ను రూ.3 కోట్లు వసూలు చేయించామని తెలిపారు. మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలంటే సకాలంలో మున్సిపాలిటీ పన్నులు చెల్లించి ప్రజలు సహకరించాలని కోరారు. సచివాలయాల వారీగా పెండింగ్ పన్నుల వివరాలు సేకరించామని చెప్పారు. అడ్మిన్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా ఆదేశాలు ఇచ్చామన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లవ కుమార్, శ్రీనివాసులు, సూర్య బాబు ఉన్నారు.

వంకను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి

వంక కబ్జాకు గురికాకుండా చూస్తాం

పట్టణంలోని పాత ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న వంక కబ్జా కాకుండా చర్యలు చూసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. రైతు బజారు నుంచి పాత ఓవర్ బ్రిడ్జి రైల్వే ట్రాక్ పక్కన ప్రవహిస్తున్న మురుగు వంకను పరిశీలించారు. వంక వెడల్పుగా ఉండేదని, కొందరు ఆక్రమించుకోవడం వల్ల చిన్నపాటి వర్షం వచ్చినా నీరు లోతట్టు ప్రాంతాలకు చేరుకుంటుందని స్థానికులు తెలిపారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు ప్లానింగ్ పరిశీలించి కబ్జా అయిన వంక వెడల్పునకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డిచ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, మేస్త్రీ నరసింహులు, మహబూబ్ బాషా ఉన్నారు.

వాలంటీర్ వ్యవస్థపై వాస్తవాలు ప్రజలకు తెలుసు : వైసిపి

ప్రజాశక్తి - హోళగుంద

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ పని తీరు గురించి ప్రజలకు వాస్తవాలు తెలుసని వైసిపి యువ నాయకులు దర్గప్ప తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ఎల్లో మీడియా పని చేస్తోందని మండిపడ్డారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీలు దోపడీకి పాల్పడితే ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన వాలంటీరు వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని తెలిపారు. మేలును చూసి ఓర్వలేకనే వాలంటీర్ వ్యవస్థపై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. వైసిపి యువ నాయకులు మౌనీష్, ముజమ్మిల్, శంభోలింగ, ఈశ్వర్, ఉదయ్ పాల్గొన్నారు.

జాలిమంచి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

- సిపిఎం మండల కార్యదర్శి లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని జాలిమంచి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో రోడ్డుపై ప్రజలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డుకిరువైపులా ముళ్లకంపలు పెరిగి, గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉరుకుంద ఈరన్న స్వామికి వెళ్లే భక్తులు, కోసిగి, కౌతాళం, పెద్దతుంబలం బ్యాంకు కోసం, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలకు ఈ రోడ్డు చాలా అత్యవసరమని చెప్పారు. రోడ్డు సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు తిమ్మారెడ్డి, గ్రామస్తులు హనుమంతు, వలీసాబ్, బసవరాజు, నాగేంద్ర, జయమ్మ, ఉరుకుందమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లింగన్న

పనితీరు మెరుగుపరుచుకోవాలి

- మండల ప్రత్యేకాధికారి శ్రీరాములు

ప్రజాశక్తి - చిప్పగిరి

సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా పనితీరును మెరుగుపరుచుకోవాలని మండల ప్రత్యేకాధికారి, పిఆర్ జెఇ శ్రీరాములు సూచించారు. శనివారం రామదుర్గం, నగరడోనా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బాలన్న, సిసింద్రీ ఆధ్వర్యంలో సచివాలయ అధికారుల పని తీరు, రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లను, పాఠశాలలో మధ్యాహ్న భోజనం, జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సుధాకర్ రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు చర్యలు చేపట్టాలన్నారు. పని తీరును బట్టి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. పాఠశాలలో మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏజెన్సీలు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హౌసింగ్ నిర్మాణ బిల్లులు రాలేదని కొంతమంది లబ్ధిదారులు వారి దృష్టికి తెచ్చారు. సాంకేతిక సమస్య వల్ల ఆలస్యం అవుతుందని, త్వరగా వచ్చేలా చూస్తామని వారు హామీఇచ్చారు. అనంతరం నగరడోనాలో ప్రజలతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఎపిఎం నాగార్జున, విఆర్ఒ క్రిష్టప్ప, హౌసింగ్ అధికారులు అంజలి, భవ్య పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీరాములు

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఉన్న భక్తులు

పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలో వెలసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి, శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోలాహలం నెలకొంది. శనివారం అమావాస్య కావడంతో రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులను దృష్టిలో ఉంచుకొని ఈరన్న స్వామి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులకు అనుమతించారు. టికెట్ కౌంటర్ వద్ద, లడ్డు ప్రసాదాల వద్ద, దర్శనం క్యూలైన్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా దేవాలయ ఛైర్మన్ నాగరాజు గౌడ్, సహాయ కమిషనర్ వాణి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఖాదర్ లింగ స్వామి దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. దర్గా పీఠాధిపతులు మున్నా పాషా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఎన్‌జిఒ నేత ఆరోపణలు సరికాదు

- ప్రభుత్వ ఉద్యోగులకు బండి శ్రీనివాసులు క్షమాపణ చెప్పాలి - ఎపి ప్రభుత్వ ఉద్యోగ సంఘ నేతల డిమాండ్

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ ఉద్యోగ నేత సూర్యనారాయణ నేతృత్వంలో గవర్నర్‌ను కలిస్తే ఎపిఎన్‌జిఒ నేతలు రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆదోని తాలూకా అధ్యక్షులు ఎస్ఎ.రషీద్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన డిఎ, జిపిఎఫ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందని న్యాయం చేయాలని, ఉద్యోగుల మేలు కోసం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ ఈనెల 19న గవర్నర్‌ను కలిసి విన్నవించారని చెప్పారు. గవర్నర్ కలిసి బయటికి వచ్చాక ఇతర సంఘ నేతలపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని, కేవలం ప్రభుత్వ సమస్యలపైనే మాట్లాడారని గుర్తు చేశారు. ఇదేదో నేరమైనట్లు ఉద్యోగుల దృష్టిలో తమ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నేతలకు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో ఎపి ఎన్‌జిఒ నేత బండి శ్రీనివాసులు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. మూడున్నర ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తోందని, ప్రభుత్వ ఉద్యోగుల సొమ్మును సైతం అవసరాలకు వాడుకుని తమ ఖాతాలను ఖాళీ చేసిందని చెప్పారు. ఉద్యోగుల అనుమతి లేకుండా తమ సొమ్మును వాడుకోవడం క్రిమినల్ నేరం కింద పరిగణించాల్సి వస్తుందని పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రికి, మంత్రివర్గ ఉప సంఘం నేతలకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేకపోవడంతో గవర్నర్‌ను కలవాల్సి వచ్చిందన్నారు. ఎపి ఎన్‌జిఒ నేత బండి శ్రీనివాసులు వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడడమే కాకుండా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఉద్యోగులకు మేలు జరిగితే సంతోషించాలే తప్ప విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే తమ నేతలు కృషి చేస్తున్నారని తెలిపారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తమ నేతలపై విమర్శలు చేసి అబాసు పాలు కావద్దని హితవు పలికారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎపి ఎన్‌జిఒ నేత బండి శ్రీనివాసులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 1న జీతాలు ఇవ్వాలని జిఒ ఉందని గుర్తు చేశారు. జీతం పొందడం ప్రభుత్వ ఉద్యోగుల హక్కు అని, ఆలస్యం చేయకుండా జీతాలు జమ అయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యక్షులు ఎల్లయ్య, వేణు, ట్రెజరర్ లక్ష్మీ నాగరవి, సహాయ కార్యదర్శులు రాధాకృష్ణ, నబీ రసూల్, వీరేష్ ఉన్నారు.

మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆదోని తాలూకా అధ్యక్షులు రషీద్

చేయని అభివృద్ధిపై గొప్పలు తగదు : వైసిపి

ప్రజాశక్తి - దేవనకొండ

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

చేయని అభివృద్ధిపై గొప్పలు చెప్పుకోవడం తగదని ఎంపిపి భర్త లుమాంబ, జడ్‌పిటిసి కిట్టు, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున విమర్శించారు. శనివారం వారు మండలంలోని బండపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని బండపల్లి గ్రామ బస్ స్టేషన్ నుంచి గ్రామంలోకి నాబార్డ్ నిధుల కింద నిర్మించిన రహదారి అభివృద్ధి పనులను టిడిపి ప్రభుత్వం చేయించిందని గ్రామ టిడిపి నాయకులు గొప్పలు చెప్పుకోవడం తగదని అన్నారు. నాబార్డ్ కింద రూ.1.25 కోట్లతో రహదారి నిర్మాణం వైసిపి ప్రభుత్వంలో చేపడితే టిడిపి నాయకులు చేయించామనడం దారుణమన్నారు. బండపల్లి గ్రామానికి సంక్షేమ పథకాల కింద రూ.2.15 కోట్లు నిధులు మంజూరు చేయించడం ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చేయని పనుల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. గొప్పలు చెప్పిన ఆ గ్రామ టిడిపి నాయకులపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. సర్పంచి లక్ష్మి, వైసిపి నాయకులు చంద్రన్న, యూసుఫ్ బాష, మద్దిలేటి, ఆంజనేయ, చెల్లెల్ల చెలిమిల నారాయణ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి

- మదారి/మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మదాసి/మదారి కురువులకు కుల ధ్రువీకరణ పత్రాలని ఇవ్వాలని సంఘం నాయకులు కోరారు. శనివారం మదారి/మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం తాలూకా కమిటీ ఆధ్వర్యంలో నందవరం గ్రామంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా మదారి/మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మాదారి కురువ రంగన్న, రాష్ట్ర అధ్యక్షులు మదాసి కురువ సోమలింగుడు, రాష్ట్ర కార్యదర్శి మదాసి కురువ గురుస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'కురువ' అంటే బీసీలు కాదని, 'ఎస్సీ' అని తెలిపారు. ఎమ్మిగనూర్ తాలూకాలో మూడు మండలాల తహశీల్దార్లు మదాసి/మదారి కురువ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షులు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కోశాధికారి బజారప్ప, జిల్లా కార్యదర్శి నరసింహులు, పత్తికొండ తాలూకా అధ్యక్షులు బ్రహ్మయ్య, ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షులు కెపి.వీరన్న, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, ట్రెజరర్ నాగార్జున, ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు ఎంకన్న, గోనెగండ్ల మండల అధ్యక్షులు లింగన్న, తిమ్మాపురం కెటి.వెంకటేష్ పాల్గొన్నారు.

దేవరగట్టులో అమావాస్య పూజలు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట, దేవరగట్టు కొండ గుహల్లో వెలసిన శ్రీమాళమల్లేశ్వరులకు శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మహేష్ స్వామి, పంపా స్వాములు అభిషేకం నిర్వహించారు. బండారు అర్చనతోపాటు కుంకుమార్చన చేశారు. మహిళ భక్తులు ప్రతి మెట్టుకూ బండారు అంటిస్తూ పూజలు చేశారు. అంతకుముందు దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు మాళమల్లేశ్వరులను దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.